# కనులనిండా కలలే

మెకాళ్ళమీద తలవాల్చి అసలే ఇంతింతలున్న కళ్లను అంతంతలు చేసుకుని ఓరగా చూస్తూంది భానుమతి. కిటికీలోనుండి ఆకాశం వంగినట్టూ, ఆ వంగిన కొమ్మకు ఆశలు పూచినట్టూ కనిపిస్తోంది. భానుమతి ప్రక్కనే చదివినంత వరకూ గుర్తుకోసం చీపురుపుల్ల పెట్టివున్న నవల. అంతవరకూ తన కళ్ళనిండా కలలు నిండి ఇప్పుడు నిస్సత్తువగా పడివుంది.

పదో తరగతి పాసయిన భానుమతి కిష్టమైనవి ఆశలు పూయించే ఆ కిటికీ, కలలు నింపే నవలలు రాసే ఆ రచయిత్రీనూ. ఇష్టం కానివి అమ్మవేసే కేకలూ, మురుగు కంపు కొట్టే ఇంటి గదులూ.

అందుకే మత్తుగా కళ్ళను అరమూసింది ఆమె. అరమూత కళ్ళతో కిటికీని, నవల నిండిన అమాయక హృదయాన్ని తెరచి ఆశగా చూస్తోంది.

చూస్తుండగానే సర్రున దూసుకువచ్చి గుమ్మం ముందు ఆగిందోకారు. అది పాలనురుగులా తెల్లగానూ, పాల సముద్రంలా పెద్దదిగానూ ఉంది. అందులో నుండి మంధరుడో, మేరువో అన్నట్టుగా గంభీరంగా దిగాడు ఓ యువకుడు.

దిగి చుట్టూ చూస్తున్నాడు. అతని కళ్ళల్లో సంతృప్తి, భక్తి భావం కన్పిస్తున్నాయి. చిన్ననాటి చెలిని చూసిన సంబరం పెదాల మీద చిర్నవ్వులో తొణికిసలాడుతోంది. అలా చూస్తున్న అతనికి వంగిన కొమ్మకవతల కిటికీ, ఆకిటికీలోనుండి కలకంఠి కళ్ళు కనిపించేయి. కళ్ళూ, కళ్ళూ కలుసుకున్న తీయని అనుభూతి ముఖమంతటా పరుచుకుంది.

భానుమతి కళ్ళు సిగ్గుతో వాలిపోయేయ్.

"మేస్టారూ... మేస్టారూ..." అతని పిలుపు మంద్రంగా వినిపిస్తోంటే తత్తరపాటుతో ఇంట్లోకి పరుగెత్తింది.

"నాన్నా.... నాన్నా" అంటూ పడకకుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న నరసింహం మాస్టార్ని లేపింది భానుమతి.

"ఏవిటమ్మా... ఏమిటీ?" నింపాదిగా అడిగాడు.

"నీకోసం ఎవరో వచ్చారు". నువ్వు గభాలున వెళ్ళకపోతే పెన్నిధి పోతుందన్నంత ఆత్రుతతో చెప్పింది భానుమతి.

"ఎవరూ?" అంటూ, సమాధానం కోసం ఎదురు చూడకుండా వాకిట్లో కెళ్ళేరు నరసింహం మేస్టారు.

తండ్రి వెనకాలే వెళ్ళి తలుపుచాటుగా వాకిట్లోకి చూస్తోంది భానుమతి.

పొడవాటి కారులో వచ్చిన యువకుడు అందంగా నిలబడి అందంగా నమస్కారం చేసాడు తండ్రికి. అందమైన వాడు ఎలా ఉన్నా అందమే!

"నేనండీ.. రాజశేఖరాన్ని."

"రాజశేఖరమా... అంటే?" అంటూ నరసింహం మేస్టారు గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించారు.

"నాగభూషణంగారబ్బాయిని. ఈ వీధిలోనే ఉండేవాళ్ళం. మీ దగ్గర చదువుకున్నాను. స్కూల్లో నా చదువు సరిగ్గా లేదని మీ దగ్గర ప్రైవేటుకు పంపించేరు నన్ను. చేరిన కొత్తలో నేన్చేసిన అల్లరికి ఇదిగో... ఈ బహుమతి ఇచ్చేరు మీరు..." అంటూ నుదుటిమీద మచ్చను చూపించడానికి ఎత్తయిన క్రాపును ఎత్తి చూపేడు.

"మీ చలవవల్ల టెన్తుక్లాసు ఫస్టుక్లాసులో పాసయ్యాను ఆనాడు."

ఇంకా గుర్తుకు రానట్టు కళ్ళద్దాలు కిందికీ మీదికీ కదుపుతున్న నరసింహం మేస్టారి చేతలే చెపుతున్నాయి.

"మా వూళ్ళో ఆస్తి విషయంలో వచ్చిన పేచీలవలన మేం వూరు వదిలిపోవలసి వచ్చింది. మా నాన్నగారు ఆనాడు ఆ పేచీలకి పండంటి తన

తహశీల్దారు ఉద్యోగాన్నే వదులుకున్నారు."

"అవును బాబూ... గుర్తు వచ్చింది. అయితే ఇప్పుడు నువ్వు ఏం చేస్తున్నట్టు?" గుర్తొచ్చిన గుర్తుగా ఆయన ముఖం ప్రసన్నమయింది.

"మీ ఆశీర్వాదం, మీరు, వేసిన పునాది వలన అయ్యేయస్ పాసయ్యానండి.ఈ జిల్లాకే జాయింట్ కలెక్టరుగా వచ్చేనిప్పుడు. జాయినయ్యే ముందు మీ ఆశీర్వచనం పొందుదామని..."

పూర్తి చేయని రాజశేఖరాన్ని "చాలా సంతోషం నాయనా..." అంటూ భుజం తట్టేరు మేస్టారు దగ్గరకొచ్చి.

"ఆనాడు మీ దగ్గర నాతో చదువుకుని, నా చిలిపితనంతో దెబ్బలుతిన్న మీ అమ్మాయి భానుమతిని చూద్దామని వచ్చేనండీ..." అంటూ పూర్తి చేసి ఇల్లంతా కలయజూసేడు రాజశేఖరం.తలపుచాటున నిలుచున్న భానుమతి నిలువునా పులకించిపోయింది. పులకింతలలో గిలగింతలలా గత స్మృతులు గుర్తుకు రాసాగాయి.

రాజు ప్రైవేటుకు వచ్చినప్పుడల్లా దోసెడు పూలు తెచ్చి తన చేతుల్లో పోసేవాడు. నాన్న ఇంకా ప్రైవేటుకు కూర్చోకపోతే, లెక్కలు మొట్టికాయల్తో సహాచెప్పేవాడు. స్కూలుకు వెళ్ళేటప్పుడూ తోడుగా జోడుగా తీసుకువెళ్ళేవాడు. క్లాసులో తేడాలు తమని విడదీస్తున్నాయని బాధపడేవాడు. వాళ్ళ పెరట్లో సాయంత్రాలు జామచెట్టుకింద ఎంతతీయగా గడిచేవి! జడపట్టుకు లాగడం, బుగ్గలు చిదమడం చేస్తుంటే వాళ్ళ అమ్మగారు ఏమనేవారు... "అలాంటి చిలిపి పనులు ఇప్పుడు కాదురా.రేపు పెళ్ళయ్యాక చేస్తే చూడముచ్చటగా ఉంటుంది."

తనలో తనే నవ్వుకుంది భానుమతి.

"అమ్మా భానూ, రాజుకు కాస్త కాఫీ తెచ్చియ్యమ్మా" అని కేకేసేరు నాన్న. వేడివేడి కాఫీ స్టీలుగ్లాసులో చేతుల్ని కాలుస్తున్నా రాజశేఖరం చల్ల మాటలకి

భానుమతికి తెలియనే లేదు.

"మా నాన్నగారు పోయేక ఆస్తి వ్యవహారాల్నీ, ఇంటి పనుల్నీ మా అమ్మగారే చూసుకుని ఇంతకాలం శ్రమపడి అలసిపోయేరు. తనకూ, నాకూ నచ్చిన పిల్లను ఇంటికోడలిగా తెచ్చుకుని బాధ్యతల్ని అప్పగించాలని మా అమ్మగారి ఆశ...."

రాజశేఖరానికి కాఫీగ్లాసు అందిస్తున్న భానుమతి ఓరగా అతని కళ్ళల్లోకి చూసింది. అతని మాటలూ, చూపులూ భానుమతిని ఏ లోకాల్లోకో తీసుకుపోతున్నాయి.

"మీ కభ్యంతరం లేకపోతే మీ అమ్మాయిని..."

ఒళ్ళంతా ప్రవహించిన విద్యుత్తు చేతిలోని కాఫీగ్లాసుని జార్చేసింది. ఠంగుమన్న శబ్దంతో ఉలిక్కి పడి ఈ లోకంలోనికొచ్చింది భానుమతి.

గలగల శబ్దం చేసుకుంటూ, దొర్లుకుంటూ వచ్చి కాళ్ళదగ్గర ఆగింది స్టీలుగ్లాసు. కిటికీలో కనిపిస్తున్న కాకి ఒకటే అరుస్తోంది. ఇంట్లోనుండి తల్లికేకలూ అలానే విన్పిస్తున్నాయి. "ఇప్పటికి ముప్ఫయ్ సార్లు కేకేసేను. పక్క ఇంటికి పోయి గళాసుడు పంచదార అప్పు తెమ్మని."

దిగ్గున లేవబోయింది భానుమతి. అసలే చీకిపోయివున్న పాత లంగా పర్రుమంది. చిరుగులో నుండి క్రింద పడివున్న రచయిత్రి నవల అసహ్యంగా కనబడుతోంది. చిరుగు కన్పించకుండా వోణీని కప్పుకుని గ్లాసు తీసుకు బయలు దేరింది భానుమతి.

ఇప్పుడామె కళ్ళనిండా కలతలే.

*(విజయ మాసపత్రిక, ఆగస్టు 1985)*

కథా నిలయం
3632
శ్రీకాకుళం